www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం జూన్ 28 2025
5
చిత్తూరు

యాప్‌ల యాతన!

- పని భారంతో అంగన్‌వాడీలు సతమతం
- వచ్చే నెల ఒకటి నుండి ఫేస్‌యాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బిత్తెడు జీతం..బారేడు చాకిరీ అన్నట్లుగా తయారైంది అంగన్‌వాడీ ల ఉద్యోగం.. పోషన్ పక్వడ్, గర్భవతులు, బాలింతలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల వివరాలను యాప్‌లలో నమోదు చేసేందుకు నానా తంటలు పడుతున్న అంగన్‌వాడీలపై కేంద్ర ప్రభుత్వం జూలై ఒకటో తేదీ నుండి అంగన్‌వాడీ సేవలు అంటే ఆయా, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిపొందుతున్న బాలింతలు, గర్భితులు, పిల్లల వివరాలను ముఖ ఆధారిత నమోదు తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంలో అంగన్‌వాడీ పని భారం పెరగనుంది. 'ఇప్పటికే చిన్న పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పడం, బాలింతలు, గర్భితులకు పోషకారం అందించడం కష్టంగా మారుతోంది మహాప్రభో!' అంటూ నెత్తినోరు కొట్టుకుంటున్న అంగన్‌వాడీలపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల యాప్‌ల నమోదు మరింత భారం కానుందని అంగన్‌వాడీలు ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బిత్తెడు జీతం బారేడు చాకిరీ

అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు రూ. 11,500, సహాయకులకు రూ.7000 జీతం ఇస్తోంది. తక్కువ జీతానికి పని చేస్తున్న అంగన్‌వాడీలు రాష్ట్ర ప్రభుత్వ యాప్‌లు బాలసంజీవి, కేంద్ర ప్రభుత్వ పోషణా ట్రాకర్ వంటి యాప్‌లలో గర్భవతులు, బాలింతల

నమోదు, 5 సంవత్సరాల లోపు పిల్లల వివరాలు ప్రతి రోజూ నమోదు చేసి చేసి ఫొటో అప్‌లోడ్ చేయాలి,,నెలకో సారి మిల్ క్యాప్ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే స్టాక్‌ను ఫోటో తీసి పెట్టాలి. ప్రతి నెలా లబ్ధిదార్ల ఈకేవైసి చేయాలి, ఫొటో తీసి యాప్‌లో నమోదు చేసి ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని అందించాల్సి ఉంటుంది. జిల్లాలోని అనేక కేంద్రాల్లో ప్రభుత్వం అగన్‌వాడీలకు ఇచ్చిన టూజి స్మార్ట్‌ఫోన్లు గ్రామీణ ప్రాంతాల్లో నెట్ పని చేయక మొరాయిస్తున్నాయి.

చిత్తూరు జిల్లాలోని 12 అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలో 2,420 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,795 మంది కార్యకర్తలు, సహాయకులుగా 1,795 మంది పని చేస్తున్నారు. 11,222 మంది గర్భిణీలు, 9,253 మంది బాలింతలు, 0-6 లోపు వయసుగల పిల్లలు 97,087 మంది మాత స్త్రీ శిశు సంక్షేమశాఖ శాఖ ద్వారా నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోష కాహారం పొందుతున్నారు. ఇప్పటికే 'ఈ యాప్‌ల గోల మాకొద్దు' అంటూ ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలపై జూలై ఒకటో తేది నుండి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ముఖ ఆధారిత యాప్‌తో పని భారం మరింత పెరగ నుంది. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం 'అంగన్‌వాడీల జీతాలు పెంచుతాం.. యాప్‌లను రద్దు చేస్తాం, రాజకీయ వేధింపులు అరికడతాం..' అని ఇచ్చిన హామీల విషయం పట్టించుకోలేదని సమ్మె సందర్భంగా నాడు ప్రతి పక్షంలో టిడిపి నేతలు అంగన్‌వాడీ దీక్షా శిబిరాల వద్దకు ఇచ్చి ఇచ్చిన హామీలను ఏమాత్రం పట్టించుకోక పోగా పని భారం పెంచాలా తీసుకొస్తున్న జీవోపై ఆందోళనలకు సిద్ధం అవుతున్నట్లు అంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్ నేతలు చెబుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిందిపోయి పారదర్శకత పేరిట యాప్‌కు పరిమితం చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో నెట్‌వర్ పని చేయక టూజీ స్మార్ట్ ఫోన్లతో ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం అప్‌డేట్ వర్షన్ స్మార్ట్ ఫోన్లు ఇచ్చి ఒకే రకమైన యాప్‌ద్వారా నమోదు చేసే వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. మొండిగా అంగన్‌వాడీలపై పని భారం పెంచేలా ప్రభుత్వం వ్యవహరిస్తే పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళలు చేపడతామంటున్నారు.

ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు (ఫైల్ ఫోటో)

హడలెత్తిస్తున్న ఒంటరి ఏనుగు..!

- పంటలపై దాడి
- అయోమయంలో రైతులు

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని ననియాల అటవీ శివార్లలోని పంటలపై ఒంటరి ఏనుగు రాత్రి సమయాల్లో వరుస దాడులు చేస్తోంది. గురువారం రాత్రి నారాయణప్ప, శంకరప్ప, నాగరాజులకు చెందిన మామిడి, టెంకాయ చెట్లు, అరటి తోటలను తిన్నంత తిని తొక్కి నాశనం చేసింది. రాత్రి సమయం కాగానే అటవీ లోతట్టు ప్రాంతం నుంచి ఒంటరి ఏనుగు యథేచ్ఛగా ఏదో ఒక గ్రామం పై పడి రైతుల పంటలను నాశనం చేస్తోంది. దీంతో రైతులు రాత్రి వేళల్లో పొలాల వద్దకు వెళ్లేందుకు హడలిపోతున్నారు. అధికారులు, ట్రాకర్లు అటవీ దూర ప్రాంతానికి మళ్లించేందుకు టపాకాయలు, బాణాసంచా పేల్చి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఏనుగుల దాడులను నివారించేందుకు కందకాలు పూర్తి చేసి, సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుతో పటిష్టమైన చర్యలు తీసుకుని పంటలకు నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

అరటి, కొబ్బరి చెట్లను తొక్కి ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు

2, 3 తేదీల్లో సీఎం కుప్పం పర్యటన

పర్యటన ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి -శాంతిపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జులై 2, 3 తేదీలలో కుప్పం పర్యటించనున్న సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు, కడ పీడీ వికాస్ మరమ్మత్, పలువురు అధికారులు శాంతిపురంలో శుక్రవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు విశ్వనాథ్ నాయుడు, కార్యదర్శి నాగరాజు, ఉదయ్ కుమార్, విజయరామి రెడ్డి, చంద్రశేఖర్, బాలకృష్ణ, పలువురు మండల ముఖ్య నేతలు పాల్గొన్నారు.



సిఎం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డి

సహకార సంఘాలు బలోపేతం

- అన్ని రకాల రుణాలు మంజూరు
- డిసిసిబి ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేసి అన్ని రకాల రుణాలు మంజూరు చేయనున్నట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి తెలిపారు శుక్రవారం స్థానిక సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిసిసిబి బ్యాంకుకు సంబంధించిన అన్ని విషయాలపై చర్చించారు. 107 వార్షిక పరిపాలన నివేదికను, 2024-25 బ్యాంకు ఆడిట్ ఆమోదించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు లాభాలు ఐదు పాయింట్ పది కోట్లు ఆర్జించగా నికర ఆర్థిక ఆస్తులు 1.92 శాతం డిపాజిట్లు, 999.8.84 కోట్లు, 2,436 .50 కోట్లు ప్రగతి సాధించినట్లు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు 76,51,000 డివిడెంట్లుగా ఇవ్వడానికి మహాజనసభ ఆమోదించింది. ప్రాథమిక సహకార సంఘాలకు ఇన్ బ్యాలెన్స్‌ను సరి చేసేందుకు యాక్షన్ ప్లాన్ ను రూపొందించారు. హెచ్‌ఆర్ పాలసీన అమలు పరిచేందుకు, ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపాలని మహాజనసభ సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారిణి లక్ష్మి, డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి వనజ, బ్యాంకు సీఈవో శంకర బాబు, సహకార సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అడ్డుకుంటున్నారు..!

- మామిడికాయల లోడ్‌ను ఆపిన అటవీ అధికారులు
- మామిడి చెట్లు అటవీ భూమిలో వున్నాయని వాదన
- 30 ఏళ్లుగా భూమి తమదే అంటున్న రైతులు
- అటవీ అధికారుల తీరుకు నిరసన

ప్రజాశక్తి -సోమల: తాము 30 సంవత్సరాలుగా పండించుకుంటున్న మామిడి యాలకను అమ్ముకోవడానికి తీసుకొస్తున్న లోడ్‌ను అటవీ అధికారులను మామిడి చెట్లు అటవీ ప్రాంతంలో వుందని కాయలు కోయవద్దని అడ్డుకోవడం అన్యాయమని నిరసిస్తూ రైతులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన సోమల నుండి దాదాపు 90 కిలోమీటర్ల దూరంలోని సోమల మండలానికి చెందిన ముచ్చు కాలువ గ్రామంలోని రైతులు తాము పండించిన మామిడి పంటను కోసి ట్రాక్టర్లలో నింపి మండీకి తరలిస్తూ ఉండగా అటవీశాఖ అధికారులు అడ్డుకొని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆరోపించారు. 30 సంవత్సరాలుగా తమ అనుభవంలోనే ఉంటూ తమ సొంత డబ్బులతో బోరు, విద్యుత్ కనెక్షన్ మోటారు బిగించి ఉపాధి హామీ ద్వారా మామిడి మొక్కలు నాటి ప్రతి ఏడాది పంటను కోసుకుంటూ వస్తున్నామని గతంలో ఒకసారి అటవీ శాఖ అధికారులు 'మామిడి చెట్లు అటవీ భూమిలో ఉన్నాయని మామిడికాయలు కోయవద్దు' అంటూ ఆదేశించడంతో కోర్టుకు వెళ్లి కోర్టు స్టే తెచ్చుకున్నామని రైతులు తెలిపారు. అయినా అటవీశాఖ అధికారులు కోర్టు స్టేను ఖాతరు చేయకుండా మామిడికాయలను కోయనీయకుండా అడ్డుకుంటున్నారని, కోసిన మామిడికాయలను ట్రాక్టర్లలో నింపి మండీలకు తరలించకుండా అడ్డుకుంటున్నారని సోమశేఖర్, రామయ్య, నీరజాక్షి, భాస్కర్, నాగరాజా , మొగిలప్ప, సిద్ధప్ప, వెంకటరమణ, శ్రీనివాసులు గౌడ్, పలువురు రైతులు ఆరోపించారు. అసలే మామిడి పంటకు ధరలు లేక గిట్టుబాటు ధర రాక ఇబ్బందులు పడుతుంటే అటవీ శాఖ వారు కొత్త సమస్యను తెచ్చిపెట్టి తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు న్యాయం చేసి తాము పంట కోసుకుని అమ్ముకునే వీలు కల్పించాలని ఇందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అటవీ అధికారుల తీరుకు నిరసన వ్యక్తం చేస్తున్న మామిడి రైతులు

వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో వార్డు కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా సాగింది. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియను నగర కమిషనర్ పి నరసింహ ప్రసాద్ పర్యవేక్షించారు. గ్రామ, వార్డు సచివాలయ శాఖ జారీ చేసిన ఉత్తర్వులు, బదిలీల మార్గదర్శకాలపై కమిషనర్ అవగాహన కల్పించారు. శుక్రవారం చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలో చిత్తూరు, తిరుపతి నగర పాలక సంస్థలు, మదనపల్లి, పుంగనూరు, పలమనేరు, కుప్పం, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసు కున్న, బదిలీల కోసం ఆప్షన్ నమోదు చేసిన వార్డు కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ ప్రక్రియకు వార్డు అడ్మిన్ కార్యదర్శులు - 153 మంది, వార్డు అమినిటీ కార్యదర్శులు -178, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు - 143 మంది చొప్పున మొత్తం 474 మంది హాజరయ్యారు. కౌన్సెలింగ్ కార్యక్రమానికి తిరుపతి అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ రెడ్డి, చిత్తూరు సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, పురపాలక సంఘాల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చిత్తూరు నగర కమిషనర్ నరసింహప్రసాద్

గుక్కెడు నీళ్లు ఇప్పించలేరా?

- రెండు నెలలుగా అవస్థలు
- అధికారులు స్పందించాలి
- ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-గుడిపల్లి: తాము రెండు నెలలుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులు వెంటనే స్పందించి గుక్కెడు నీళ్లు ఇప్పించాలని గుడిపల్లి గ్రామపంచాయతీ బిజిగానిపల్లి గ్రామస్తులు స్థానిక ఎంపిడివో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడిపల్లి మండలం గుడిపల్లి గ్రామ పంచాయతీ బిజిగానిపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా గ్రామంలోని 30 కుటుంబాలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నామని తెలిపారు. అవస్థలు పడుతున్నా అధికారులు, నాయకులు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఎంపిడివో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించామని తెలిపారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం అందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో బిజిగానిపల్లి గ్రామస్తులు ఆందోళన విరమించి వెనుదిరిగారు.



ఎంపిడివో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బిజిగానిపల్లి గ్రామస్తులు

ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజా సమస్యలు పరిష్కరించాలని మేయర్ సూచన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్ : ప్రజా సమస్యలపరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మేయర్ ఎస్ అముద పేర్కొన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వారి కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో భాగంగా శుక్రవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ప్రజా సమస్యలు అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజలు అందించిన వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. ఆర్థికపరమైన అంశాలపై అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత ఉన్నతాధికారులకు అందించాలన్నారు. శుక్రవారం కార్యక్రమంలో మొత్తం 27 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, చిత్తూరు రూరల్ ఎంపీడీవో శ్రీనివాసులు, డీటీ ఇబ్రహీం, హౌసింగ్ ఎఈ శ్రీధర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న నగర మేయర్ అముద

చదువు నేర్పించాల్సిన చోట కూలి పనులా?

- ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఇంత దారుణమా..
- మాజీ మంత్రి ఆర్‌కెరోజా

ప్రజాశక్తి -విజయపురం (నగరి): విద్యాబుద్ధులు నేర్పించాల్సిన చోట పిల్లల వద్ద కూలి పనులు చేయించడం, అదీ ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గం బైరుగానిపల్లి పాఠశాలలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడంపై మాజీ మంత్రి ఆర్కేరోజా ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల వద్ద చెత్త ఎత్తించడమేమిటి? ఆమె ప్రశ్నించారు. తల్లికి వందనం పేరిట రూ.15 వేలు ఇస్తామని రూ.13వేలే ఇస్తూ ఒక్కో విద్యార్థికి రూ.2వేలు పాఠశాల నిర్వహణకు కేటాయిస్తున్నామని చెబుతున్నపుడు విద్యార్థుల వద్ద పారిశుధ్య పనులు ఎందుకు చేయిస్తున్నారన్నారు. 'చదువు నేర్పించాల్సిన చోట కూలీ పనులా?' అది విద్యాలయమా? లేక శిక్షా శిబిరమా?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఇప్పటికైనా పేద పిల్లల భవిష్యత్తును దృష్టి లో వుంచుకుని విద్యాశాఖ పై దృష్టి సారించాలన్నారు.

కంకర తేలిన సంభ్రం బస్టాప్ సమీప తారు రోడ్డు



గుంతల మయంగా మారిన బాలయ్య కొత్తూరు రోడ్డు

పిచ్చిరెడ్డిపల్లి వద్ద గుంతలమయమైన పాచిగుంట రోడ్డు

రహదారులు ధ్వంసం..

- వాహన చోదకులు, పాదచారులకు నరక యాతన
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలంలో పలు రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కంకరతేలి గుంతల మయంగా మారాయి. ఏళ తరబడి ఈ రహదారులు ఇలాగే వున్నా ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. రోడ్ల దుస్థితి కారణంగా స్కూలు బస్సులు, అంబులెన్సులు, ద్విచక్రవాహనాలు వెళ్లాలన్నా, పాదచారులు వెళ్లాలన్నా అష్టకష్టాలు పడాల్సి వస్తోందని నరకయాతన తప్పడం లేదని వాహన చోదకులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ప్రభుత్వ పాలకులు, అధికారులు స్పందించి ఈ రహదారులను బాగుచేసి సమస్యను పరిష్కరించాల్సి వుంది.

వాహన చోదకులు, పాదచారులకు నరకం

మండలంలోని గంగాధర నెల్లూరు నుండి ముసలయ్యగారిపల్లె వరకు తారు రోడ్డు పలుచోట్ల కంకర్లు తేలి గుంతలమయంగా మారింది. దీంతో ప్రధానంగా ద్విచక్ర, అంబులెన్స్, స్కూల్ బస్‌లు, కార్లు వంటి వాహనదారులు రాకపోకలు సాగించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

తూగుండ్రం పాల డెయిరీ సమీపంలో నుంచి పిల్లారి కుప్పం రోడ్డు వరకు, తమిళనాడు సరిహద్దు దొడ్డిపల్లె ఆది ఆంధ్రవాడ నుంచి కొత్త వెంకటాపురం మీదుగా అగ్రహారం బస్ స్టాప్ వరకు రోడ్డు గుంతల మయమైంది. దళవాయిపల్లి బస్టాప్ నుండి కుమ్మరపల్లి మలుపు వరకు రోడ్డు ధ్వంసం అయింది. కాలేపల్లి నుండి పాచిగుంట వరకు అక్కడక్కడా గుంతల మయంగా వుంది. గంగాధర నెల్లూరు మండలం లోని వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రంలోకి ప్రజలు, చిత్తూరు నుంచి వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు గంగాధరనెల్లూరు, పాలసముద్రం మండలాలకు వెళ్లాలంటే వారి పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

అధికారులు పట్టించుకోవాలి

చిత్తూరు - తచ్చూరు హైవే రోడ్ నిర్మాణంవల్ల అందుకోసం మెటీరియల్ భారీ టన్నేజిలతో లారీల్లో తీసుకుని వెళ్లడంవల్ల రోడ్లు గుంతలు ఏర్పడి, ధ్వంసమైన రోడ్లపై వాహనాల రాకపోకలకు నిత్యం తంటాలు పడుతూ, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ద్విచక్ర వాహనదారులు గుంతల రోడ్లలో అదుపు తప్పి ప్రమాదాలకు గురై గాయాలతో ఆస్పత్రి పాలైన సంఘటనలూ చోటు చేసుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడ్లను బాగుచేసి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళుతున్నాం..!



నేను వ్యాపార వస్తువులు తెచ్చుకోవడానికి నిత్యం చిత్తూరు, తమిళనాడులోని పొన్నకి వెళ్లి వస్తూ ఉంటాం.. ఈ దారులలో వెళ్లాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. రోడ్లు గుంతల మయంగా ఉన్నాయి. వాహనాలు సైతం మరమ్మతులకు గురవు తున్నా యి. అధికారులు స్పందించి ఈ రోడ్లను బాగు చేయాలి..

- చిట్టి బాబు మొదలి, వ్యాపారి, తూగుండ్రం గ్రామం, గంగాధర నెల్లూరు మండలం.

ఈ రోడ్లను బాగు చేయండి..



మండలంలోని పలుచోట్ల గుంతల మయంగా ఉన్న రోడ్లు బాగు చేయండి..ప్రజలు అనారోగ్య సమస్య వచ్చినప్పుడు ఎమర్జెన్సీగా 108 వాహనాలు సైతం వెళ్లాలన్నా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.. పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు తెలిపినా అధికారులు పట్టించుకోలేదు. కనీసం ఆ గుంతలైనా పూడ్చాలి..

- ఏకాంబరం, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, పెద్దకాలువ పంచాయతీ , గంగాధర నెల్లూరు మండలం.

డాక్టరు కృష్ణ చైతన్య బాధ్యతలు స్వీకరణ

బాధ్యతలు స్వీకరించిన డాక్టరు కృష్ణచైతన్య

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని, పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కృష్ణ చైతన్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కార్వేటినగరం మండలం నుంచి డాక్టర్ హేమశ్రీ డిప్యూటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఆమె స్థానంలో కృష్ణ చైతన్య బాధ్యతలు తీసుకున్నారు.

విద్యార్థుల వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టరు అన్నపూర్ణ శారద

మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని డాక్టరు వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ విభాగం, ఐక్యూఏసి పర్యవేక్షణలో 'నిషా ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో 'నిషా ముక్త్ భారత్ అభియాన్'కు మద్దతుగా శుక్రవారం ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను వివరించారు. పలువురు విద్యార్థులు మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఐక్యూ ఏసి సమన్వయకర్త ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల నుండి భారతం మిట్ట సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

6న కళామందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి -గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో గంగవరంలో నిర్మించిన కళామందిరం మూడవ వార్షికోత్సవాన్ని జులై ఆరవ తేదీ ఆదివారం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు పి తులసినాథం నాయుడు, పుష్పలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 50 మంది విద్యార్థులకు బహుమతులు అందించడంతోపాటు 20 మందికి వార్షికోత్సవ పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. తెలుగు భాష, సాహిత్య అభిమానులు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ద్రౌపదిదేవి, ధర్మరాజుల ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు శుక్రవారం ఉదయం వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ధ్వజారోహణంతో ప్రారంభ మయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రేవతి, ప్రసాద్ బాబు మిల్క్ డెయిరీ ఆధ్వర్యంలో 500 మందికి అన్నదానం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భాగవతారిణి రెడ్డమ్మ పాండవ జననం హరికథ నిర్వహించారు. మొదటి రోజు ఉభయదారులుగా పడమటి వీధి యాదవకులస్తులు ద్రౌపది ధర్మరాజుల ఉత్సవాలకు సారె అందించారు. రాత్రి వీధి నాటకం వెంకటేశ్వర నాట్య కళామండలి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వీధి నాటకం నిర్వ హించారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రవి యాదవ్, ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజు, ఉపాధ్యక్షులు రవి రెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి మొదలియార్, ఉప కోశాధికారి సాయి రాయల్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధ్వజారోహణంతో ప్రారంభమైన ద్రౌపదిదేవి ఉత్సవాలు

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, టిడిపి నాయకులు

ఘనంగా 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ మొరసనపల్లి'

ప్రజాశక్తి- శాంతిపురం: మండల పరిధిలోని మొరసనపల్లి గ్రామపంచాయతీ మొరసనపల్లి గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ మొరసనపల్లి కార్యక్రమం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ పీ ఆర్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని టిడిపి మండల అధ్యక్షులు విశ్వనాథ నాయుడు పేర్కొన్నారు. అనంతరం కుప్పం-పలమనేరు జాతీయ రహదారి నుండి మొరసనపల్లి గ్రామం వరకు పరిసరాల పరిశుభ్రత పై గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.అనంతరం గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పంచాయతీలో మొక్కలు నాటడానికి మొక్కలను మాజీ సర్పంచ్ చెంగప్ప స్వామి, ఖుషి డెయిరీ, శ్రీరచ్చ డెయిరీ ప్రొడక్ట్స్, సుగుణ మిల్క్ ప్రొడక్ట్స్, ఎస్ ఎల్ వి టమాటో బండి, కే ఎం టమాటో మార్కెట్, మార్కెట్ రమణ అందించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏ ఆర్ స్వాతి, సచివాలయ సిబ్బంది, మాజీ ఎంపీపీ ఉదయ్ కుమార్, చంద్ర, రమేష్, గోపాల్, నారాయణ స్వామి, సుగుణమ్మ పంచాయతీ కార్యకర్తలు, మొరసనపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు సాహితీ సభ

పలు పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి- పలమనేరు : పలమనేరు లయన్స్ క్లబ్‌లో ఈ నెల 29న ఆదివారం ఉదయం పది గంటల నుండి సాహితీ వేత్తలతో ఇష్టాగోష్టి, సాహిత్య పుస్తకాల పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పలమనేరు రచయిత బాలాజీ తెలిపారు. కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలనుండి రచయితలు కవులు పాల్గొనే ఈ సభలో మధ్యాహ్నం సాహితీ వేత్తలతో ఇష్టాగోష్టి నిర్వహిస్తున్నారని, సాహితీ మిత్రులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని తెలిపారు. చిత్తూరు జిల్లా సీనియర్ కవి, కథకుడు సి వేణు గురించి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ మధురాంతకం నరేంద్ర స్మారక ఉపన్యాసం, పలమనేరు బాలాజీ రెండు పుస్తకాలు 'ఏకలవ్య కాలనీ' - కథా సంపుటి, 'లోపలేదో కదులుతున్నట్టు' - కవితా సంపుటి పరిచయ కార్యక్రమం వుంటుందన్నారు. స్వచ్ఛత ప్రచురణలు బెంగళూరు, లయన్స్ క్లబ్ పలమనేరు, పలమనేరు రచయితల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. ప్రముఖ సాహితీవేత్తలు సి భానుమూర్తి రెడ్డి, ఎన్‌వేణుగోపాల్, ఆర్ఎం ఉమామహేశ్వర రావు, వి ప్రతిమ, భూమన్, ఆచార్య కుసుమ కుమారి, సుంకోజి దేవేంద్రాచారి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, వంగాల సంపత్ రెడ్డి, పల్లిపట్టు నాగరాజు, ఎండపల్లి భారతి, కవిత్రశ్రీ, టిఎస్ఏ కృష్ణమూర్తి, దోర్నాదుల సిద్ధార్థ , యువశ్రీ మురళి పాల్గొంటారని తెలిపారు.

ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కోర్సులు స్థానికుల హర్షం

ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ కోర్సులు మంజూరు చేయడంపై కుప్పం ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు , విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కుప్పం ప్రజల తరపున ధన్యవాదాలు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలోని నిరుపేద ప్రజలకు ఈ అవకాశం కల్పించడంతో కూటమి ప్రభుత్వానికి కుప్పం నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తామని తెలిపారు. టిడిపి కుటుంబ సభ్యులు, జనసే, బిజెపి కుటుంబ సభ్యులు , విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బాబు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

చెత్త సేకరణ పనులు పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు

చెత్త సేకరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: వెదురు కుప్పం మండలం పచ్చికాపల్లంలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ రావు శుక్రవారం పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ కి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. పురవీధుల్లో శుభ్రత పెరిగిందని ప్రశంసించారు. దీన్ని ఇలాగే కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పురుషోత్తం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మేకలు, గుర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారిణి

ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- పశువైద్య అధికారిణి డాక్టర్ శ్రీవిద్య

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : గొర్రెలు, మేకలకు ఈనెల 26వ తేదీ నుండి జూలై 10వ తేదీ వరకు ప్రభుత్వ ఏర్పాటు చేసిన నట్టల నివారణ ఆరోగ్య శిబిరాలను ప్రతి గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తారని, జీవాలు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధి కారి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పద్మాపురం, బసివిరెడ్డి పల్లి ,నల్లాపల్లి, ఏఎం పురం గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. మేకలు, గొర్రెలు, వైద్య శిక్షణ గర్భకోశ వ్యాధులకు నట్టల నివారణ పశువ్యాధి నిధాన పరీక్షలు శాస్త్రీయ యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి శ్రీవిద్య , వెటర్నరీ అసిస్టెంట్లు పశు వైద్య సిబ్బం ది పాడి రైతులు పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

బాలికల ఉన్నత పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి -విజయపురం నగరి : మండలంలో జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలను ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయం, అసిస్టెంట్ ఇంజనీరు నాగభూషణం సందర్శించారు. పాఠశాల భవన నిర్మాణ పనులను, సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరగా పనులను పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పార్వతి దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

రిటైర్డు ప్రధానోపాధ్యాయుడి దంపతులను సన్మానిస్తున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- వి కోట : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైందని జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని గందారమాకుల పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి ఉద్యోగ విరమణ ఆ పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై వెంకటరమణ రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో వెంకట రమణారెడ్డి 37 సంవత్సరాల సుదీర్ఘ అనుభవంతో జిల్లాలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా బోధించారన్నారు. వారి వద్ద చదువుకున్న అనేకమంది విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడడం ఉపాధ్యాయులకు గర్వకారణం అన్నారు. వీరి స్ఫూర్తితో పాఠశాలలోని ఉపాధ్యా యులు విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాఠశాల ప్రాంగణంలో తాగునీటి సమస్యను వారి దృష్టికి తీసుకురావడంతో జిల్లా పరిషత్ నిధులతో నూతన తాగునీటి బోరు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కమలనాథ్ తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

తహశీల్దారుకి సన్మానం

ప్రజాశక్తి -పెద్దపంజాణి: మండల తహశీల్దారుగా వచ్చిన హనుమంతును ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు శుక్రవారం తహశీల్దారు కార్యాలయంలో కలసి పూలహారం వేసి దుశ్శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో దళితులు, బడుగు, బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న రెవెన్యూ శ్మశాన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, సకాలంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ నిర్వహించాలని ప్రత్యేక శ్రద్ధతో దళితుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జోన్ అధ్యక్షుడు కెళవాతి సుబ్రహ్మణ్యం, మండల మాల మహానాడు అధ్యక్షుడు మంజునాథ్,ప్రచార కార్యదర్శి తిప్పయ్య, కార్మిక సంఘం కార్యదర్శి దాశనపల్లి శివయ్య, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి జయప్ప, కార్యదర్శి రామచంద్రయ్య, రెడ్డప్ప,యూత్ లీడర్ వెంకటేష్, తిరుమలప్ప, రంగప్ప, గంగులప్పా, రెడ్డప్ప, ఎస్సీ ఎస్టీ మానిటింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దారును సన్మానిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు


ఎస్‌టివోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యల పరిష్కారానికి సహకరించారు

ఎస్‌టిఓపై ఉపాధ్యాయుల ప్రశంసలు

ప్రజాశక్తి -బంగారుపాలెం: ఎస్‌టిఓ తమ సమస్యలు పరిష్కరించేవారని రాష్ట్ర గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయ సంఘాల ఉపాధ్యక్షులు భాస్కరరావు ప్రశంసించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉప ఖజానా శాఖ అధికారి హరి ప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రేడ్-2 ప్రధాన ఉపాధ్యాయ సంఘం 5వ జోన్ ఉపాధ్యక్షులు భాస్కరరావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీతభత్యాలు చెల్లింపుల్లో ఆలస్యం లేకుండా ఎప్పటి బిల్లు అప్పటిలోగా పనులు పూర్తిచేసిన అధికారి హరిప్రసాద్ అని ఆయన ఉద్యోగ విరమణ చెందడం మనందరికీ బాధాకరమని ఆయన సన్మానించడం మనందరి బాధ్యత అన్నారు. అనంతరం ఆయనకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిరాజు, బేరినాథ్ , చిట్టెమ్మ విశ్రాంతి ప్రధానోపాధ్యా యులు పార్థసారథి, బంగారుపాళ్యం సబ్ ట్రెజరీ కార్యా లయం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: తహశీల్దారు

ప్రజాశక్తి -యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలు అధికారులు నేరుగా తెలుసుకుని సమస్య పరిష్కరించేందుకే పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామని తహశీల్దారు పార్థసారథి అన్నారు. భూమిరెడ్డిపల్లి పంచాయతీ వెంకటాపురం గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి పోలీసు ,రెవెన్యూ, అభివృద్ధి శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా యదమరి ఎస్ఐ ఈశ్వర్ యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో యువకులు, విద్యార్థులు , గంజాయికి దూరంగా ఉండాలని అలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో దారి సమస్యలు భూ సమస్యలు, ఉన్నవారు తహశీల్దారుకు పోలీసులకు ఫిర్యాదు చేసే సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ ఏపీవో సంధ్యారాణి మాట్లాడుతూ ఉపాధి కింద రైతులకు అన్ని రకాల వ్యవసాయ అనుబంధ పనులు, అన్ని పండ్ల రకాల చెట్లు మొక్కలు పెంపకం కల్పిస్తున్నారని అవసరమైన రైతులు ఉపాధి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అవసరమైన రైతులు ఉపాధి గ్రామంలోని నిరుపేద కూలీలకు, ఉపాధి హామీలో వందరోజుల పని దినాలు కల్పిస్తానని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్తులు గ్రామంలోని సమస్యలు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇప్పించాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు స్పందించి వాటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు పార్థసారథి, మండల అభివృద్ధి అధికారి వేణు, యాదమరి ఈశ్వర్ యాదవ్, ఉపాధి హామీ అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి , ఆర్ఐ ప్రసాద్, విలేజ్ రెవెన్యూ అధికారి సమాజ్ అలీ, పంచాయతీ కార్యదర్శి దళిత నాయకులు మురుగేష్, రవి, హెండ్సీ కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ సంధ్యారాణి

క్రైం న్యూస్

రైలు పట్టాలపై కనుగొన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : కుప్పం మండలం మల్లానూరు గ్రామపరిధిలోని రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని స్థానికులు గుర్తించి వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ చేపట్టారు. గురువారం అర్ధరాత్రి చెన్నై బెంగళూరు శతాబ్ది రైలు కింద పడి మృతుడు ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని రైల్వే పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 60 సంవత్సరాల వయస్సు వున్న మృతుడు తెల్లని షర్టు, నేవీ రంగు ప్యాంటు ధరించి ఉన్నారని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు కుప్పం రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు. గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహన దారుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండలంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు తంబుగాని పల్లి గ్రామానికి చెందిన మనోహర్ కుమారుడు జయచంద్ర (19) చిత్తూరులో తన సొంత పని నిమిత్తం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా తంబుగాని పల్లి క్రాస్ వద్ద వాహనాన్ని మలుపు తిరుగుతున్న సమయంలో పలమనేరు నుండి చిత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో జయ చంద్రకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి -సోమల: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరుకులను వృద్ధులు, వికలాంగులు చౌక దుకాణాల వద్దకు రాకుండా వారి ఇంటి వద్దకే వెళ్లి బియ్యం, చక్కెర అందించాలన్న ఆదేశాను సారం మండలంలోని పలు చౌక దుకాణం డీలర్లు వీఆర్వోలు ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మ గారి పల్లి, బోనమంద , నంజంపేట, ఆవులపల్లి, నెల్లిమంద పంచాయతీల పరిధిలోని చౌక దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను విఆర్వోలు డీలర్లు పంపిణీ చేశారు. దీంతో వికలాంగులు , వృద్ధులు ఎంతో సంతోషిస్తూ తాము చౌక దుకాణాల వద్దకు వచ్చి సరుకులు తీసుకొని వాటిని మోసుకుంటూ ఇంటికి రాలేని పరిస్థితులలో ప్రభుత్వం ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య, చెత్త సేకరణ పనులను ఎంపీడీవో నారాయణ శుక్రవారం పరిశీ లించారు. తడి పొడి చెత్త ప్లాస్టిక్ వ్యర్థాలను వేరువేరుగా సేకరించాలని దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ముఖ్యంగా ప్రభుత్వం నుండి చెత్త సేకరణ పై వచ్చే ఫోన్ కాల్స్ కు వాస్తవ సమాధానాలు చెప్పి సహకరించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

చెత్త తరలింపును పరిశీలిస్తున్న ఎంపీడీవో

'హంద్రీ -నీవా'తో కుప్పం సస్యశ్యామలం

ప్రజాశక్తి- రామకుప్పం: కుప్పం ప్రాంతాన్ని అభివృద్ధికి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు అన్ని విధాలా కృషి చేస్తున్నారని నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు చలపతి పేర్కొన్నారు. శుక్రవారం వారు పత్రిక సమావేశంలో మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు కలలను సాకారం చేసేందుకు హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పం ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు పనులు శరవేగంగా చేపడుతున్నారన్నారు. పాడి రైతులకు పరిశ్రమల అభివృద్ధిలో భాగంగా గోకులం షెడ్లు, పశువుల దాణా సబ్సిడీతో అందిస్తున్నారన్నారు. సబ్సిడీ ద్వారా వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్, ఉద్యానవన పంటలకు కావలసిన సబ్సిడీ ఇస్తూ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. మామిడి రైతులకు గిటుబాటు ధరతో టన్నుకు రూ4 వేల రూపాయలు ఇస్తున్నారని పేర్కొన్నారు. పాలరు నదిపై 53.35 కోట్ల రూపాయలతో 17 చెక్ డ్యాములు, 14.22 కోట్ల రూపాయలతో 51 చెరువుల మరమ్మతులు మంజూరు చేశా రన్నారు. రైతులను దశాదిశా అభివృద్ధి చేసేందుకు మినీ ఎయిర్ పోర్ట్‌ను స్థాపించి కూర గాయలను ఎగుమతులు చేసి ఆర్థిక అభివృద్ధి చెందేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, కోల్లపల్లి బాబు, గోపాల్ పాల్గొన్నారు.

మా మొర ఆలకించరా?

ఐదో రోజుకు మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ దీక్షలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష శుక్రవారం ఐదో రోజుకు చేరుకుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, హెచ్ఆర్ పాలసీ, గ్రాడ్యుటీ, పింఛను, విధి నిర్వహణలో మృతి చెందితే రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తదితర వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం శరవణ, ప్రధాన కార్యదర్శి డి శివకుమార్, కోశాధికారి కేఆర్ శివప్రసాద్, గౌరవ సలహాదారు పి వెంకటేష్, ఉపాధ్యక్షులు ఎం హరికృష్ణ, ఎన్ వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ టి గోపాలాచారి, ఏ ఉష, యూనియన్ సభ్యులు కేవీ సునీల్ కుమార్, పి శంకర్, ఎస్ పీరుల్లా, ఎం వేలు, కే సుజాత, వెంకటేష్ ఏడియ, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

చిత్తూరులో

విజయపురం (నగరి) : 'మా మొర ఆలకించరా..?' అంటూ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఐదవరోజు శుక్రవారం మోకాలిపై నిలబడి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.

పుంగనూరు: మున్సిపల్ కార్మికులు చేపట్టిన దీక్షకు రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చి వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఛైర్మన్ అలీం బాషా అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఇంజనీరింగ్ విభాగం ఒప్పంద కార్మికులు చేపట్టిన దీక్ష కు ఛైర్మన్ అలీం బాషా శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోజుల తరబడి కార్మికులు ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం, కార్మికులపై కక్ష సాధింపేనని అన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు మినిమం టైం స్కేల్ వర్తింపజేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన ప్రకారం మున్సిపల్ ఒప్పంద కార్మికులకు కూడా పథకాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జవహర్ బాషా, శ్రీరాములు పలువురు ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

పుంగనూరులో